

కంటోన్మెంట్‌లో మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పోలింగ్‌శాతం పెంచేందుకు చర్యలు

- ఇంటింటికి పోల్ చీటీల పంపిణీ
- లష్కర్‌లో పోలింగ్ ఏర్పాట్లు వేగవంతం

సికింద్రాబాద్: సికిందాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను, ఓటరు జాబితాను సిద్ధం చేసిన ఎన్నికల అధికారులు తాజాగా పోలింగ్ చీటీల పంపిణీ కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇంటింటికీ ఎన్నికల సిబ్బంది వెళ్లి పోల్‌చీటీలను పంపిణీ చేయడంతో పాటు పోలింగ్ బూత్‌ల వివరాలు తెలియజెప్పుతున్నారు. ఓటుహక్కును వినియోగించుకోవాలని ఓటర్లను కోరుతున్నారు.

◆ నియోజకవర్గంలో 2,65,982 మంది ఓటర్లు ఉన్నారు. వారందరికీ పోల్‌చీటీలు అందించాలని, అందుబాటులో లేని వివరాలు తమకు తెలియజేయాలని సిబ్బందికి అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఈ మారు ముందే పంపిణీ..

లోగడ జరిగిన అన్ని ఎన్నికల్లో పోల్‌చీటీల పంపిణీని ఎన్నికల తేదీకి 4 రోజుల ముందు ప్రారంభించేవారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోల్‌చీటీలు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పంపిణీ విధులను మొక్కుబడిగా ముగించేవారు. ఈసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు మూడు వారాల ముందు నుంచే పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో 220 పోలింగ్‌బూత్‌లు ఉండగా.. బూత్‌లెవల్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, సెక్టోరియల్ అధికారులు కలిపి మొత్తంగా 350 వరకు సిబ్బందిని నియమించారు. ఇంటింటికీ పోల్‌చీటీలు అందుతున్నాయా లేదా అనే విషయాలను పర్యవేక్షకులు, సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



ఇంటింటికీ పోల్ చీటీలను పంపిణీ చేస్తున్న ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌శాతం పెంచేందుకు..

నియోజకవర్గం మొత్తంమీద 220 పోలింగ్‌బూత్‌లు ఉండగా.. అందులో తక్కువ పోలింగ్ జరుగుతున్న 100 పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఓటరు చీటీల పంపిణీ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించారు. పోల్‌చీటీలు అందించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతుల గురించి ఓటర్లకు వివరిస్తున్నారు. ఓటుహక్కును పక్కాగా వినియోగించుకోవాలని చెబుతున్నారు.

లష్కర్ అసెంబ్లీ ఓటర్లు..

మొత్తం ఓటర్లు :	2,65,982
పురుషులు :	1,32,781
మహిళలు :	1,33,174
ఇతరులు :	27

నేరుగా సంప్రదించాలి..



పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. మే 9 లోగా పోల్ చీటీల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయనున్నాం. పోల్ చీటీలు అందనివారు 1950 నెంబర్‌ను సంప్రదించాలి. ఎన్నికల వివరాలు, సలహాలు, సూచనలు చేయడం కోసం జీహెచ్ఎంసీ కార్యాలయంలోని కంట్రోల్‌రూంలో నేరుగా సంప్రదించవచ్చు.

–హేమంతకేశవ్ పాటిల్, ప్రిసైడింగ్ అధికారి

సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి గెలుపు ఖాయం : కె.లక్ష్మణ్

బౌద్ధనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. సోమవారం వారాసిగూడ బీజేపీ కార్యాలయంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని బూత్ కమిటీ సభ్యులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఇంటింటికీ వెళ్లి గత పదేళ్లలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధే మరోసారి బీజేపీని గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారన్నారు. గారడి మాటలు చెప్పే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈనెల 10న నగరంలో తలపెట్టిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజస్థాన్ బీకనీర్ ఎమ్మెల్యే తారాచంద్ సరస్వతి, మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్, నాగేశ్వర్‌రెడ్డి, మాజీ మేయర్ కార్తీకరెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం..

బన్సీలాల్‌పేట్: బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం బన్సీలాల్‌పేట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకుడు మర్రి పురురవరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు, నాయకులు, కార్యకర్తలు న్యూబోయిగూడ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని ఈ ఎన్నికల్లో రాజకీయంగా ఆశీర్వదించాలని కోరారు. మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి స్పందన, బీజేపీ నేతలు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, గుంటి సత్యానారాయణ, కిరీటా, వికాస్, శ్రీనివాస్, రాణాప్రతాప్, పరమేష్, వంశీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

గరిబీ హఠావో నినాదంతో కాంగ్రెస్ దేశంలో 70 ఏళ్ల పాలన..

రసూల్‌పురా: గరిబీ హఠావో నినాదంతో దేశంలో 70 ఏళ్ల కాంగ్రెస్ పాలన కొనసాగించినప్పటికీ పేదరికం తగ్గలేదని బీజేపీ పదేళ్ల పాలనలో పేదరికం లేకుండా చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ అన్నారు. ప్రవాసి వ్యాపారుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం రాత్రి కంటోన్మెంట్ ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగింది. ఆయన మాట్లాడుతూ.. దేశంలో, రాజస్థాన్‌లో మోదీ నాయకత్వంలోని డబుల్‌ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా పర్యాటకుల వసతి కోసం రూ.300 కోట్లతో ప్రత్యేక మౌలికవసతులు కల్పించామన్నారు. ఉత్తరాఖండ్ మంత్రి సత్పాల్ మహరాజ్ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిందన్నార

కాంగ్రెస్‌కు మాల సంఘాల జేఏసీ మద్దతు



దానం నాగేందర్‌తో వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఓటువేసి గెలిపించాలని మాల ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ జి. చెన్నయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పలు బస్తీల్లోని మాలలు, దళిత బహుజనులు, మైనార్టీలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న బీజేపీ పార్టీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయటంతో పాటు సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించి దళిత సమాజాన్ని కేసీఆర్ మోసం చేశారన్నారు. మాల ప్రజా సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బూర్గుల వెంకటేశ్వర్లు, గోపాజు రమేష్, మన్నె శ్రీధర్‌రావు, ఎస్సీసెల్ చైర్మన్ రమేష్ బాబు, నాయకులు పరమేష్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, అడ్వకేట్ వేపప్రకాష్ యాదవ్, నస్రీన్ పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ సభ్యులు సైతం..

అమీర్‌పేట: వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ సభ్యులు సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు తెలిపారు. సోమవారం క్రిస్టియన్ యూనిటీ ఫౌండర్ జనరల్ సెక్రటరీ రాధా మ్యాథ్యూస్ ఆధ్వర్యంలో దానంను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దానం గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని చెప్పారు. మైనార్టీలకు భద్రత లేకుండా పోయిందని, దేశ వ్యాప్తంగా ఎక్కడ చూసినా.. క్రిస్టియన్లు, చర్చిలపై దాడులు జరుగుతున్నాయన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని నిర్ణయించుకున్నామన్నారు. సీనియర్ న్యాయవాది సీ.హెచ్.సుధీర్‌కుమార్, నేషనల్ కో– ఆర్డినేటర్ డాక్టర్ కెనడీ, సభ్యులు పాల్, ప్రభాకర్, వినోద్, ఐజియా, రీటర్ రత్నం, లీలా, జయరాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ విజయం తథ్యం

అమీర్‌పేట: సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయం ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం అమీర్‌పేట్ డివిజన్‌లో పలుచోట్ల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వం హయాంలో మంత్రిగా పనిచేసిన తలసాని స్థానికంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల పక్షాన ఉంటూ.. వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే పద్మారావుగౌడ్‌ను ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మరని తెలిపారు. అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడు ఎం.హనుమంత్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు అశోక్‌యాదవ్, నర్సింహ, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం..

సనత్‌నగర్: సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. బేగంపేటలో సోమవారం కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుపై ఓటువేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, అక్బర్, మహ్మద్ మొహినుద్దీన్ పాల్గొన్నారు.

◆ సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొలను భూపాల్‌రెడ్డి, ఆకుల రాజు, విజయ్‌సింగ్, సత్యనారాయణయాదవ్, రాజేష్‌ముదిరాజ్, పురుషోత్తం, ఝాన్సీరెడ్డి, పుష్పలత, పద్మ, సరితగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బంధువులతో సరదాగా ఈతకు వెళ్లి..

కాలుజారి బావిలోపడి యువకుడి మృతి

యలమంచిలి రూరల్: సరదాగా బంధువులతో కలిసి ఈతకు వెళ్లిన ఓ యువకుడు కాలుజారి బావిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం సోమన్నపాలెంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. యలమంచిలి రూరల్ పోలీసులు వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ వద్ద పాత బోయిన్‌పల్లిలో స్వర్ణధామనగర్‌కు చెందిన చలపాక పాల్ సరోజ్ (23) రెండ్రోజుల క్రితం కశింకోటలో తన మేనత్త ఇంట్లో శుభకార్యానికి వచ్చాడు. వరుసకు సోదరుడైన గౌతం, బంధువులు ముగ్గురు కలిసి సోమన్నపాలెం వద్ద బావిలో ఈతకు వెళ్లారు. గౌతం, ప్రణీత్ బావిలోకి దిగి ఈత కొడుతున్నారు. పాల్ సరోజ్ బావిలోకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీట మునిగాడు. అతడిని కాపాడేందుకు ఇద్దరు యత్నించినా ఫలితం లేకపోవడంతో ఎర్రవరంలో చంద్రగిరి లక్ష్మణ్‌ను పిలిచారు. అతడు వచ్చి బయటకు తీసి ఆటోలో సమీప ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐఎస్సీ, ఐసీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సనత్‌నగర్: ఐఎస్సీ, ఐసీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) విద్యార్థులు సత్తా చాటారు. ఐఎస్సీ సైన్స్ స్ట్రీమ్‌లో విద్యార్థిని కాకి హర్షిత 93.80 (469/500) శాతం సాధించి హెచ్‌పీఎస్ టాపర్‌గా నిలిచారు. హుమానిటీస్ స్ట్రీమ్‌లో మైలపల్లి రాణి ధన్యరూప 93.40 (467/500) శాతంతో అగ్రస్థానంలో నిలవగా.. భవ్యగార్గ్ 93 శాతం (465/500)తో రెండో స్థానంలో నిలిచింది. కామర్స్ స్ట్రీమ్‌లో వంశిక సంచేతి 91.40 (457/500) శాతంతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఐసీఎస్ఈ ఫలితాల్లో అర్జున్‌రావు 98.3 శాతంతో అగ్రస్థానంలో నిలిచారు. 97.2 శాతంతో యార్లగడ్డ హర్షశ్రీ విష్ణు, శ్రియాన్స్ బాల్, సిద్ధి బహేతిలు తదుపరి స్థానాల్లో నిలిచారు. ఐఎస్సీ, ఐసీఎస్ఈ ఫలితాల్లో 100 శాతం ఫలితాలను సాధించడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం పేర్కొంది.

అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుతూ.. ఆ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ నాయకుడు ఇక్బాల్‌ఖాన్ ఆధ్వర్యంలో పలువురు మైనార్టీ నాయకులు అక్కడికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్‌ను సమర్పించారు. పద్మారావు అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఓటువేసిన నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి కూకట్‌పల్లి జేఎన్టీయూలోని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రం వద్ద ఆయన ఓటు వేశారు. ఎన్నికల విధుల్లో ఉండే అధికారులందరూ.. తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటువేయాలని సూచించారు. అందరూ ఓటు వేసి సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందన్నారు.

రిసెప్షన్ సెంటర్ సందర్శన

సికింద్రాబాద్: ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఎన్నికల అధికారులు సోమవారం సందర్శించారు. సికింద్రాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ నేతృత్వంలో డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్‌లో ఈవీఎంలు, వీవీపాట్లు భద్రపరిచిన తీరు, పనిచేస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. పోలింగ్, కౌంటింగ్ రోజున ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈవీఎంలు భద్రపర్చడం మొదలు, కౌంటింగ్‌కు ఓయూ ప్రాంగణం నుంచే ఎన్నికల వ్యవహారాలు కొనసాగుతాయని చెప్పారు. సహాయక ఎన్నికల అధికారులు ఎల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి, స్వర్ణలత, నటరాజ్, ఎన్నికల విభాగం ఇన్‌చార్జి భుజేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస్‌యాదవ్ పెళ్లిరోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిశోర్‌కుమార్, ఆంజనేయులు, ఆకుల హరికృష్ణ, నాగేందర్, ఓదెల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద

రసూల్‌పురా: గత పదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేసి కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత సాయన్నను గెలిపించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద అన్నారు. నివేదితకు మద్దతుగా కార్ఖానా తమిళ్ బస్తీ, చర్చిగల్లీలో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రక్షణ మంత్రిత్వశాఖ ఆధీనంలో ఉన్నప్పటికీ మాజీ సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిసారించి కంటోన్మెంట్ ప్రాంతంలో ఉచిత తాగునీటి పథకం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, అసరా ఫించన్లు, డబుల్‌బెడ్రూం ఇళ్లు, రోడ్లు, నాలాల అభివృద్ధి చేశారన్నారు. బోర్డు సభ్యురాలు అనితాప్రభాకర్, సాదిక్, మైనార్టీ నాయకులు అహ్మద్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



కార్ఖానా ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వివేకానంద

రాగిడి లక్ష్మారెడ్డి, నివేదిత ప్రచారం..

మూడో వార్డు మడ్‌ఫోర్ట్‌లో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్నలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఓటు వేయడం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ అగర్వాల్

రసూల్‌పురా: దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటువేయడం మనందరి బాధ్యత అని తెలంగాణ ప్రవాసి సమాజ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్ అగర్వాల్ సూచించారు. ఆదివారం రాత్రి గన్‌రాక్ గార్డెన్‌లో ఎన్నికల్లో ఓటు ప్రాముఖ్యతపై సుభాష్ ఆధ్వర్యంలో ప్రవాసీయుల బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది ప్రవాసీయులు ఉన్నారని ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంపై విద్యావంతులు ఇరుగు పొరుగువారికి అవగాహన కల్పించాలని కోరారు. ఓట్లు వేసేందుకు అవసరమైతే రవాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని సమాజ్‌కు చెందిన పలువురు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వంద శాతం ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటూ.. మనమంతా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అరుణ్ దకోటియా, నరేందర్‌శర్మ, శ్రీ కిషన్‌శర్మ, విజయ్ అగర్వాల్, వినోద్ సంచేటి సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యుడిపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

టీజీజీడీఏ గాంధీ యూనిట్ డిమాండ్

గాంధీఆస్పత్రి: కోరుట్ల ఆస్పత్రిలో విధి నిర్వహణలో ఉన్న వైద్యుడిపై దాడిచేసి సజీవ దహనానికి యత్నించిన దుండగులపై కఠిన చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) గాంధీ యూనిట్ డిమాండ్ చేసింది. ఆసుపత్రి ప్రాంగణంలోని టీజీజీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. కోరుట్ల ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రవణ్‌పై కొంతమంది దుండగులు దాడికి పాల్పడడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు. నిరుపేద రోగుల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న డాక్టర్‌పై దాడి చేసి సజీవ దహనానికి యత్నించడం పైశాచిక చర్యకు నిదర్శనమన్నారు. దుండగులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. టీజీజీడీఏ గాంధీ యూనిట్ అధ్యక్షుడు భూపేంద్రసింగ్‌రాథోడ్, ప్రధాన కార్యదర్శి అబ్బాయ్య, ట్రెజరర్ రవి, జీసీ సభ్యుడు మురళీధర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు

రసూల్‌పురా: రాష్ట్రంలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లను కైవసం చేసుకుంటుందని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బొల్లారం రిసాలబజార్, డౌటన్ బజార్, మా సంతోషి కాలనీల్లో పార్టీ నేతలు కొత్త సంజీవరెడ్డి, నరసింహకన్నన్ ఇతర నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటర్లు హస్తం గుర్తుపై ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీగణేష్‌లను గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే పేదల బతుకులు బాగుపడుతాయన్నారు. అరవింద్, బాల్‌రాజ్, రషీద్, నిఖిల్, తరుణ్, పూర్ణ, చంద్ర, అంథోని, సతీష్, అక్రం తదితరులున్నారు.

గాంధీలో అరుదైన శస్త్ర చికిత్స

గాంధీఆస్పత్రి: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి శస్త్రచికిత్స చేసి గాంధీ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, పిడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున మాట్లాడుతూ.. మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన చిన్నారి సంధ్య (11) కొంతకాలంగా బీపీ, తలనొప్పి, మైకం, చెమట, వాంతులు తదితర రుగ్మతలతో బాధపడుతుంది. పలు కార్పొరేట్, ప్రైవేటు ఆస్పత్రులకు తిరిగినా ఫలితం లేకపోవడంతో కొద్దిరోజుల క్రితం గాంధీఆస్పత్రిలో చేరింది. పిడియాట్రిక్ సర్జరీ విభాగ వైద్యులు పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించి అరుదైన 'బైలేటరల్ అడ్రినల్ ఫియోక్రోమోసైట్' వ్యాధితో బాధపడుతున్నట్లు, దీనికి కారణమైన కిడ్నీ పైభాగంలో ప్రాణాంతకమైన కణితి పెరుగుతున్నట్లు గుర్తించారు. ఛాలెంజ్‌గా తీసుకున్న వైద్యులు ఈనెల 4న ఐదు విభాగాలకు చెందిన వైద్య నిపుణుల పర్యవేక్షణలో సుమారు మూడు గంటలు శ్రమించి సర్జరీని విజయవంతంగా పూర్తిచేసి చిన్నారికి పునర్జన్మ ప్రసాదించారు. ఐదు లక్షల మందిలో ఒకరికి ఇలాంటి వ్యాధి వస్తుందని గాంధీ పిడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున అన్నారు. ఈ సర్జరీని గాంధీ ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహించామని సూపరింటెండెంట్ తెలిపారు. గాంధీ పిడియాట్రిక్, ఎండోక్రైనాలజీ, రేడియాలజీ, అనస్థీషియా హెచ్‌ఓడీలు డాక్టర్ నాగార్జున, జార్జ్, విజయ్‌శేఖర్‌రెడ్డి, శాంతిశ్రీ, మురళీధర్, వైద్యులు శ్రీనివాస్, అక్షితరెడ్డి, మనోజ్‌రెడ్డి, హర్ష, పద్మావతి, అజయ్‌మోహన్, శ్రీనివాసరావు, జాస్మిన్, నర్సింగ్ సిబ్బంది, వైద్య ఉన్నతాధికారులు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓయూ జాక్ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ పులిగంటి వేణుగోపాల్ మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన్నట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం



ఉమాకాంత్ (ఫైల్)

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై అమర్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట్‌లోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన మర్జోడే ఉమాకాంత్ (21) తన తండ్రితో కలిసి పానిపూరి బండి నడుపుతున్నాడు. ఏప్రిల్ 24న ఉమాకాంత్ సోదరుడు రోహిత్‌రావు తండ్రి సుభాష్‌రావు పానిపూరి బండి వద్దకు వెళ్లారు. స్నానం చేసి బండి వద్దకు వస్తానని చెప్పిన చిన్న కుమారుడు ఉమాకాంత్ తిరిగి రాకపోవడంతో తండ్రి సుభాష్‌రావు ఫోన్ చేశాడు. స్విచ్ఛాఫ్ రావడంతో ఇంటికి వెళ్లి చూడగా కనిపించలేదు. దీంతో తండ్రి స్నేహితులు, బంధువులను వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి సెల్‌ఫోన్ చోరీ

అమీర్‌పేట: దృష్టి మరల్చి సెల్‌ఫోన్ అపహరించిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఉద్యోగి టి.బసవరాజు(60) సోమవారం బీకేగూడ వద్ద కూరగాయలు తీసుకునేందుకు వెళ్లాడు. అక్కడ ఇద్దరు వ్యక్తులు తారసపడి జేబులోనుంచి రూ.20 నోటు కింద పడిపోయిందని చెప్పారు. ఆ నోటును తీసుకునేందుకు బసవరాజు కిందకు వంగిన సమయంలో జేబులోనుంచి సెల్‌ఫోన్ తీసుకుని బైక్‌పై ఉడాయించారు. సీసీ ఫుటేజీతో పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సనత్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్నానగర్ బీరప్ప దేవాలయం ఎదుట ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు 108 వాహన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించారు. అప్పటికే మృతి చెందాడని, సుమారు అతడికి 40–45 ఏళ్లు ఉంటాయన్నారు. స్థానికంగా ఆరా తీయగా.. మృతుడి పేరు మునీర్‌గా తెలిసింది. కూలీ పనులు చేస్తూ.. గత నాలుగేళ్లుగా బీరప్ప దేవాలయ ప్రాంగణంలోనే ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి సంబంధీకులెవరైనా బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యం



ఎండీ.షాహీన్(ఫైల్)

లాలాపేట: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ గృహిణి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఎండీ షరీఫ్ ఉద్దీన్, ఎండీ షాహీన్ (28) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. కాగా తన భార్య ఫోన్‌లో ఎవరితో మాట్లాడుతుందనే అనుమానంతో భార్యను ప్రశ్నించగా.. ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. దీంతో షాహీన్ తన తల్లి రజియాను పిలిపించి ఆమె వద్ద పిల్లలను వదిలేసి వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై హాస్టల్ నిర్వాహకుల దాడి

అమీర్‌పేట: ఓ యువకుడిపై హాస్టల్ నిర్వాహకులు మూకుమ్మడిగా దాడికి పాల్పడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా పెదకూరపాడుకు చెందిన సయ్యద్ ఆసిఫ్ బీటెక్ పూర్తిచేసి ఎస్ఆర్‌నగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ.. కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఆదివారం ఆసిఫ్‌ను కలిసేందుకు అదే గ్రామానికి చెందిన జహీర్ అనే వ్యక్తి వచ్చాడు. హాస్టల్‌లో వాష్‌రూమ్‌లో జహీర్ ముఖం కడుకుని ఆసిఫ్‌తో కలిసి హాస్టల్ నుంచి బయటకు వెళ్తుండగా.. హాస్టల్ నిర్వాహకుడు గొడవకు దిగాడు. తల్లిని ఉద్దేశించి దుర్భాషలాడటంతో తన తల్లిని తిడుతున్నందుకు వారిని ప్రశ్నించాడు. ఆవేశానికి లోనైన హాస్టల్ నిర్వాహకుడు కుటుంబ సభ్యులతో కలిసి ఆసిఫ్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ గదిలో వ్యక్తి అనుమానాస్పద మృతి

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ధరం కరం రోడ్డులో హరిబాబు అనే వ్యక్తి హాస్టల్ నడుపుతున్నాడు. రాజశేఖర్ అనే వ్యక్తి పదేళ్లుగా పరిచయం. కాగా శనివారం ఉదయం 11 గంటల సమయంలో రాజశేఖర్ హాస్టల్‌కు వచ్చి ఆరోగ్యం బాగాలేదని చెప్పాడు. దీంతో సాయంత్రం 6 గంటల సమయంలో అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి విశ్రాంతి తీసుకునేందుకు హాస్టల్‌లో ఓ గదిని ఏర్పాటు చేశాడు. పండ్లు, జ్యూస్‌లు ఇచ్చి వచ్చాడు. సోమవారం ఉదయాన్నే నీళ్లు పెట్టేందుకు హాస్టల్ బాయ్ రాజశేఖర్ వద్దకు వెళ్లి చూసేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఈ విషయాన్ని హరిబాబుకు చెప్పాడు. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. వారు రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతికి గల కారణాలపై పోలీసులు మరో కోణంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కేర్ టేకర్‌గా ఉంటూ.. వృద్ధుడి అకౌంట్‌లో డబ్బు చోరీ

అమీర్‌పేట: వృద్ధుడి వద్ద నమ్మకంగా ఉంటూ రూ.3 లక్షలతో ఉడాయించిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట లీలానగర్‌లోని రోహిణి అపార్ట్‌మెంట్‌లో 38 ఏళ్ల జి.అరుణ్‌సాయి అనే వ్యాపారి ఉంటున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తాతయ్య బాగోగులు చూసుకునేందుకు సురక్ష హోమ్ సర్వీసెస్ నుంచి గుడాల సురేష్ అనే వ్యక్తిని 2023 నవంబర్‌లో కేర్ టేకర్‌గా నియమించుకున్నారు. సదరు వృద్ధుడి ఫోన్‌లో గూగుల్ పే యాప్ ఇన్‌స్టాల్ చేసి అతడి అకౌంట్‌లోని రూ.3 లక్షలు సురేష్ భార్య అకౌంట్‌కు పంపాడు. తాత అకౌంట్‌లో నుంచి డబ్బులు మాయం కావడంతో బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను పరిశీలించాడు. కేర్ టేకరే డబ్బులు కాజేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.